'ఉచితంగా బిఎస్ఎన్ఎల్ 4జి సిమ్‌లు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో మెరుగైన సర్వీసుల కోసం తమ సిమ్‌లను 4జి టెక్నాలజీకి అప్‌గ్రేడ్ చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు జిల్లా టెలికాం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ శ్రీను ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 2జి/3జి సిమ్‌లు వినియోగిస్తున్న వారు ఇంకా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 60 వేల మంది ఉన్నారని, వారికి 4జి సిమ్‌లను బిఎస్ఎన్ఎల్ ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. ఉచిత సిమ్‌లు బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లోనూ, ఫ్రాంచైజీలు, రిటైలర్లు, ఏజెంట్ల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం వినియోగిస్తున్న సిమ్ ఏ సిమ్ అనేది తెలుసుకోవడానికి 54040 అనే నెంబర్‌కు 'ఎస్ఐఎం' అని ఎస్ఎంఎస్ పంపడం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అందరూ వీలైనంత త్వరగా 4జి సిమ్‌కు అప్డేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

ధాన్యం.. దగా..!

మూడు నెలలైనా జమకాని రబీ ధాన్యం సొమ్ము

'పశ్చిమ'లో రూ.400 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.45 కోట్లు బకాయి

అదిగో..ఇదిగో అంటూ రైతులను మభ్యపెడుతున్న అధికారులు

తెచ్చిన అప్పులకు వడ్డీ తడిసి మోపెడు

సాగెలా చేయాలని అన్నదాత ఆవేదన

కూటమి ప్రభుత్వ తీరుపై రైతుల్లో అసహనం

'ధాన్యం సొమ్ము ఇవ్వకుండా గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలైనా రైతుల ధాన్యం సొమ్ము గురించి పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ సాగు ఆదిలోనే దెబ్బతింది. ధాన్యం సొమ్ము సకాలంలో ఇవ్వరు. ఇలాగైతే వ్యవసాయం ఎలా చేయాలి' అంటూ అన్నదాత తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు. రబీ ధాన్యం విక్రయించి మూడు నెలలైనా ఇంకా సొమ్ము జమ చేయకపోవడంపై తీవ్ర వేదనకు గురవుతున్నాడు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడంతోపాటు అప్పుల వాళ్ల నుంచి పెరుగుతున్న ఒత్తిళ్లు తట్టుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. దీంతో రెండు జిల్లాల్లోని రైతాంగం పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన రబీలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పంట దిగుబడులు బాగానే వచ్చాయి. రైతులు ఆనందంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించారు. అక్కడ నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ము మాత్రం రైతుల ఖాతాల్లో జమకాని పరిస్థితి నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఏలూరు జిల్లాలో రెండు లక్షల 161 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయాలి. ఏప్రిల్ 28 తర్వాత రైతుల ఖాతాల్లో సొమ్ము జమ నిలిచిపోయింది. రైతులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో కొత్త ప్రభుత్వం జులై మొదటివారంలో కొంత సొమ్ము విడుదల చేసింది. ఈ సొమ్మును మే పదో తేదీకి ముందు ధాన్యం విక్రయించిన రైతులకు మాత్రమే జమ చేశారు. పదో తేదీ తర్వాత విక్రయించిన రైతులకు సొమ్ము వేయలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.400 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.45 కోట్లు, రెండు జిల్లాల్లో మొత్తంగా రూ.445 కోట్లు ధాన్యం సొమ్ము రావాల్సి ఉంది. మే పదో తేదీ అంటే దాదాపు మూడు నెలలు గడిచిపోయింది. ధాన్యం విక్రయించిన తర్వాత మూడు నెలలపాటు సొమ్ము జమ చేయకపోతే రైతుల పరిస్థితి ఏమిటనే ఆలోచన కూడా పాలకులకు లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడిచింది. రైతులకు సంబంధించిన ధాన్యం బకాయిలకు తొలి ప్రాధాన్యతివ్వాల్సి ఉన్నప్పటికీ సరిగ్గా పట్టించుకోవడం లేదనే ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. ధాన్యం సొమ్ము కోసం రైతులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న మీకోసం కార్యక్రమానికి వెళ్లి వినతులు ఇచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. పౌర సరఫరాల శాఖాధికారుల వద్దకు వెళ్తే అదిగో..ఇదిగో అంటూ చెప్పడం తప్ప ధాన్యం సొమ్ము మాత్రం జమకాని పరిస్థితి నెలకొంది. మూడు నెలలకు రూ.లక్ష పెట్టుబడి తెచ్చిన రైతులకు వడ్డీ నూటికి రూ.మూడు చొప్పున లెక్కిస్తే రూ.తొమ్మిది వేలు, రూ.రెండు లక్షలు అప్పు తెచ్చిన రైతు రూ.18 వేలు వడ్డీ కింద చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎప్పుడిచ్చిన ధాన్యం సొమ్ము మాత్రమే ఇస్తుందే తప్ప వడ్డీ చెల్లించదు. దీంతో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సొమ్ము వడ్డీతో చెల్లించాలని రైతులు కోరుతున్నారు. కోత యంత్రాలకు, ధాన్యం కిరాయిలు, కూలీలకు, పెట్టుబడి తెచ్చిన అప్పుల వాళ్ల నుంచి ఒత్తిళ్లు తట్టుకోలేక రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ఓపక్క ఖరీఫ్ సాగు వరదలకు దెబ్బతింది. మరోపక్క రబీ ధాన్యం సొమ్ము చేతికి రాక రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం సొమ్ము వడ్డీతో కలిపి వెంటనే జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులు చేసిన తప్పేంటీ..

గోలి నర్సిరెడ్డి, పేరంపేట, జంగారెడ్డిగూడెం మండలం

ఆరు నెలలు కష్టపడి పండించిన పంటను విక్రయిస్తే మూడు నెలలు గడిచినా సొమ్ము ఇవ్వలేదు. పంట పండించడమే రైతులు చేసిన తప్పా ప్రభుత్వమే చెప్పాలి. మా కుటుంబం 12 ఎకరాల వరకూ రబీలో వరి సాగు చేశాం. మే 11న ధాన్యం విక్రయించాం. రూ.ఎనిమిది లక్షలు వరకూ ధాన్యం సొమ్ము రావాల్సి ఉంది. ఇప్పటి వరకూ చిల్లిగవ్వ జమ కాలేదు. మీకోసం కార్యక్రమంలో వినతిస్తే పది రోజుల్లో జమవుతాయని చెప్పారు. ఇప్పటి వరకూ జమ కాలేదు. నూక శాతం పేరుతో మిల్లర్లు ఎదురు రూ.ఆరు వేలు కట్టించుకున్నారు. కిరాయి కింద రూ.44 వేలు చెల్లించాల్సి వచ్చింది. ఇన్ని నెలలు ధాన్యం సొమ్ము ఇవ్వకపోతే రైతుల పరిస్థితి ఏమిటో ఏఒక్కరూ ఆలోచించడం లేదు. ధాన్యం సొమ్ము వెంటనే జమ చేయాలని కోరుతున్నాం.

పెట్టుబడికి వడ్డీ తడిసి మోపెడు

కొండేటి వెంకట నరసింహారావు, కౌలురైతు, తాడేరు, భీమవరం మండలం

రబీలో 30 ఎకరాలు సాగు చేశాను. ఇంకా 20 ఎకరాలకు సంబంధించిన ధాన్యం సొమ్ము రూ.15 లక్షలు రావాల్సి ఉంది. మే రెండో వారంలో ధాన్యం విక్రయించాం. మూడు నెలలు ధాన్యం సొమ్ములు ఇవ్వకపోతే రైతులు వ్యవసాయం ఎలా చేయాలి. ధాన్యం సొమ్ము వెంటనే జమ చేయాలని కోరుతున్నాం.

రబీ సొమ్ము రాలేదు.. సార్వా నారుమళ్లు మునిగాయి

కౌరు శ్రీను, మల్లవరం లంక, నరసాపురం మండలం

రబీలో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. మే రెండో వారంలో 315 సారలు విక్రయించాను. దాదాపు రూ.రెండు లక్షలు ధాన్యం సొమ్ము రావాలి. మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం ఇస్తే ఈ నెల ఐదో తేదీన పడతాయని చెప్పినా పడలేదు. ట్రాక్టర్ కిరాయిలు, రబీ పెట్టుబడికి తెచ్చిన అప్పు ఇప్పటికీ తీర్చలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క వరదలకు ఖరీఫ్ నారుమడులు మునిగిపోయాయి. రైతుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు..?

ప్రజాశక్తి - నూజివీడుటౌన్

మండలంలోని పల్లెర్లమూడిలో చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగుచూసినట్లు సమాచారం. నిందితునిపై గతంలో ఇదే తరహా కేసు ఉందని, ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసినట్లు సమాచారం. నూజివీడు డిఎస్‌పి ఆధ్వర్యంలో పోలీసులు సాగిస్తున్న విచారణలో మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. అదే సమయంలో బాలికను విజయవాడ ఆసుపత్రిలో పరామర్శించిన మంత్రి కొలుసు పార్థసారధి అత్యాచార నిందితుడిని రెంటచింతలలో అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే.

మృగాడిని కఠినంగా శిక్షించాలి

ఐద్వా, రైతుసంఘం నేతల వినతి

ఆర్‌డిఒకు వినతి అందిస్తున్న నేతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పల్లెర్లమూడిలో చిన్నారిపై పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన మృగాడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ భవానీ శంకరికి నేతలు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, నేత జి.శారద, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ మృగాడిపై తీసుకునే చర్యలు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా హెచ్చరికలా ఉండాలన్నారు. దీనిపై ఆర్‌డిఒ మాట్లాడుతూ ఇప్పటికే సంఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించామన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపడుతున్నట్లు తెలిపారు. అదే సందర్భంగా మహిళలు, పిల్లలపై వేధింపులు, దాడుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. అనంతరం సిఐకు వినతిపత్రం అందించారు.

తొలుత నేతలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో ప్రసాద్, పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

వరద బాధితులకు నిత్యావసరాలు, వంటపాత్రలు, దుప్పట్లు పంపిణీ

సిపిఎం ఆధ్వర్యాన నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

భారీ వర్షాలకు విలీన మండలాల్లో ప్రజలు చికెన్‌గున్యా, విష జ్వరాలు ప్రబలి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. మండలంలో వరద ప్రభావిత ప్రాంతమైన యర్రతోగు గ్రామాన్ని సిపిఎం నేతలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదలకు గ్రామాలు నీట మునిగి జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. దీంతో ప్రజలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి పనులు చేసినా సొమ్ము రాక ఆర్థికంగా అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సాయం ఏదైనా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఇవ్వాలని కోరారు. అనంతరం గోదావరి వరద ముంపుబారిన పడ్డ కొండరెడ్డి గ్రామం ఎర్రతోగు వరద బాధితులకు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, బియ్యం, ఉల్లిపాయలు, బెండకాయలు, వంటపాత్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు, మండల కార్యదర్శి ధర్మల రమేష్, ఆదివాసీ గిరిజన సంఘం నేతలు కుంజా నవీన్ ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన..

వేలేరుపాడులోని సిపిఐ కార్యాలయంలో మండలంలో తెల్లపల్లి గ్రామానికి వలస వచ్చిన గొత్తికోయ ల కుటుంబాలకు సిపిఐ ఆధ్వర్యాన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి..!

ఆసుపత్రి వద్ద మృతురాలి కుటుంబీకుల ఆందోళన

సకాలంలో వైద్యం అందక బాలింత మృతి

ప్రభుత్వాసుపత్రి వద్ద కుటుంబీకుల ధర్నా

మా లోపం లేదు: వైద్యాధికారి

ఘటనపై విచారణ చేస్తాం

ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వైద్యుల నిర్లక్ష్యం ఫలితంగా నిండు ప్రాణం బలైంది. సరైన సమయంలో వైద్యం అందక బాలింత వగ్గెల అలివేలు మంగ (23) ప్రాణాలొదిలింది. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి బిడ్డ ఆలనాపాలనా చూడకుండానే మృతి చెందింది. బాలింత మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు ప్రభుత్వాసుపత్రి వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులు, వైద్యులతో చర్చించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దీనికి సంబంధించి మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన వగ్గాల రాముతో అలివేలు మంగకు కొంతకాలం క్రితం వివాహమైంది. అలివేలుకు నెలలు నిండటంతో కుటుంబీకులు గత జులై 27న జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు ఆపరేషన్ చేసి కాన్పు చేశారు. మగ బిడ్డ పుట్టాడు. అనంతరం ఈ నెల 5న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేయడంతో ప్రకాష్ నగర్ చేరుకున్నారు. అదేరోజు అంటే సోమవారం రాత్రి 1.30 గంటలకు అలివేలు అనారోగ్యంగా ఉందని భర్త రాముకు చెప్పడంతో మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు టి.నరసాపురం ప్రభుత్వాసుపత్రికి ఆటోలో తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని 108 అంబులెన్స్‌లో చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మంగ మరణించినట్లు వైద్యులు నిర్ధారించారని కుటుంబీకులు తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యమే అలివేలు మంగ మృతికి కారణమని మృతురాలి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మృతదేహంతో టి.నర్సాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా మృతురాలి భర్త రాము మాట్లాడుతూ తెల్లవారుజామున అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య మంగను ఆసుపత్రికి తీసుకెళ్లగా ఆ సమయంలో ఆసుపత్రి గేట్లు వేసి ఉన్నాయని, ఎంతసేపు గేట్లు బాదినా ఎవరూ స్పందించలేదన్నారు. 15 నిమిషాల తర్వాత గేట్లు తోసుకుని లోపలికి వెళ్లి వాచ్‌మెన్‌ను లేపామన్నారు. దీంతో స్టాఫ్ నర్సు వచ్చారని, అయితే ఎటువంటి వైద్యం అందించలేదని ఆరోపించారు. చింతలపూడి తీసుకెళ్లాలని చెప్పారని, కనీస వైద్యం అందించి ఉండే తన భార్య ప్రాణాలు దక్కేవని వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు సిపిఎం నాయకులు మద్దతు పలికారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళనకారులతో చర్చించారు. భర్త పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి తరలించారు. అయితే వైద్య సహాయం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యం లేదని, పేషెంట్‌ను తీసుకొచ్చిన తరువాత స్టాఫ్‌నర్సు కొన్ని పరీక్షలు చేసి సెలైన్ పెట్టేందుకు ప్రయత్నించేలోపు కుటుంబీకులు పేషేంట్‌ను తీసుకెళ్లిపోయి, మళ్లీ గంట తర్వాత వచ్చారని మండల వైద్యాధికారి జె.కల్పనారాణి చెబుతున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ నాగేశ్వరరావు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు చేపడతామన్నారు.

మంగ (ఫైల్‌ఫొటో)

కారకులపై చర్యలు తీసుకోవాలి: ఎపి వ్యకాస

ఏలూరు అర్బన్: టి.నర్సాపురం ప్రభుత్వాసుపత్రిలో బాలింతరాలు అలివేలు మంగ మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెల్లవారుజామున ఆటోలో ఆసుపత్రికి వెళ్లినా డాక్టర్ విధుల్లో లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆసుపత్రిలో చేర్చుకోకపోవడంతో సకాలంలో వైద్యం అందక మంగ మృతి చెందిందని ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రి పేదలకు వైద్యం చేయడానికా లేక ప్రాణాలు తీయడానికా అని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని, నిర్లక్ష్యంగా వ్యవహించిన డాక్టర్, స్టాఫ్ నర్సుపై చర్యలు తీసుకోవాలని, మంగ కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు

ర్యాగింగ్, మాదక ద్రవ్యాలపై అవగాహన



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నిషేధ, మాదకద్రవ్యాల నిరోధం చట్టాలపైన, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపైన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో తోటి విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని, జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు. కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టం తీవ్రంగా పరిగణిస్తుందని, అటువంటి చర్యలకు కఠిన శిక్షలు ఉన్నాయని, అది వారి భవిష్యత్తు మీద ప్రభావం చూపిస్తుందని సూచించారు. అలాగే ప్రతి కళాశాలలో ర్యాగింగ్ నివారణా కమిటీలను ఏర్పాటు చేయాలని, వాటి వివరాలను కళాశాలలో పొందుపరచాలని సూచించారు. ఏ విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం అందిస్తుందని తెలియజేశారు. అలాగే నేటి సమాజంలో ప్రతి చిన్న కళాశాల నుంచి కార్పొరేట్ కళాశాల వరకూ విద్యార్థులను తప్పు తోవ పట్టించడానికి సంఘ వ్యతిరేక శక్తులు ఉన్నాయని, వారి స్వలాభం కోసం విద్యార్థులకు మత్తు పదార్థాలను అలవాటు చేస్తున్నారని, కావున ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండాలని, చెడు స్నేహాలకు పోకుండా సమాజ అభివృద్ధికి తమ వంతు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూన కృష్ణారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.

అత్యాచారాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని సాయి రాకేష్ కాలేజ్‌లో అత్యాచారాలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రస్తుత కాలంలో మహిళలపై జరిగే దాడులు, అత్యాచారాలను అరికట్టాలని, అలాంటి సమస్యలు ఎదురైనప్పుడు ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై కొయ్యలగూడెం సాయి రాకేష్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 300 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కాలేజీ యాజమాన్యం కేశవ రావు, మహిళా సంఘం అధ్యక్షురాలు నాగమణి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు యు.వినోద్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ అధ్యక్షురాలు బిందు ప్రియదర్శిని పాల్గొన్నారు.

అనంతరం విషయం అర్థం చేసుకున్న విద్యార్థినులు తమపై జరిగిన కొన్ని సంఘటనలను ఎస్ఎఫ్ఐ నాయకులకు వివరించగా సదరు వ్యక్తులపై కొయ్యలగూడెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ నెంబర్లకి 9346290877, 9391415686 ఎప్పుడైనా కాల్ చేయవచ్చునని సూచించారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ తెలిపారు.

శాంతిభద్రతలను పరిరక్షిస్తా : డిఎస్‌పి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సిబ్బంది సమన్వయంతో ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను పూర్తిగా పరిరక్షిస్తానని ఏలూరు నూతన డిఎస్‌పి శ్రావణ్ కుమార్ అన్నారు. ఏలూరు నగరంలోని సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో మంగళవారం ఏలూరు డిఎస్‌పిగా డి.శ్రావణ్ కుమార్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏలూరు సబ్ డివిజన్ పరిధిలోని కైకలూరు, గణపవరం, ఏలూరు నగర సిఐలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. 2014 సంవత్సరంలో శ్రావణ్ కుమార్ సిఐ నుంచి డిఎస్‌పిగా ఉద్యోగోన్నతి పొందారు. మొట్టమొదటిగా ఆయన డిఎస్‌పిగా విజయవాడ ట్రాఫిక్ ఎసిపిగా పని చేశారు. 2019 నుంచి 2022 ఆయన ఇంటిలిజెన్స్ డిఎస్‌పిగా పనిచేశారు. మధ్యలో ఒక 30 రోజుల కాలం ఏలూరు స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పిగా కూడా పనిచేశారు. 2022 సంవత్సరం నుంచి 2024 సవత్సరం వరకు చిత్తూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ డిఎస్‌పిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన అక్కడే పనిచేస్తూ ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సాధారణ బదిలీలలో భాగంగా ఆయన ఏలూరు డిఎస్‌పిగా బదిలీ అయ్యారు. అనంతరం ఆయన మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను కలిసిన వారిలో ఏలూరు రెండో పట్టణ సిఐ ప్రభాకర్, మూడో పట్టణ సిఐ శ్రీనివాస్ రావు, గణపవరం సిఐ సుభాష్, భీమడోలు సిఐ రవికుమార్‌లతోపాటు ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు ఉన్నారు.

మొక్కజొన్న సీడ్ కంపెనీల మోసాలు అరికట్టాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ద్వారకాతిరుమల: మొక్కజొన్న సీడ్ కంపెనీల మోసాలు అరికట్టాలని, సిహెచ్.పోతేపల్లి, తూర్పుయడవల్లి గ్రామాల్లో మోసపోయిన సీడ్ మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యుటిఎఫ్ హాలులో సీడ్ మొక్కజొన్న కంపెనీల మోసాలపై ఆయన మాట్లాడారు. కంపెనీల నుండి రైతులకు ఎటువంటి అగ్రిమెంట్లు ఇవ్వకపోవడం వల్ల రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. మొక్కజొన్న కంపెనీల మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వాల వైపు నుండి తగిన చర్యలు ఉండటం లేదన్నారు. దీంతో కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని చెప్పారు. సిహెచ్.పోతేపల్లి, తూర్పుయడవల్లిలో 130 ఎకరాల్లో సీడ్ మొక్కజొన్న సాగు చేసిన రైతులకు నకిలీ విత్తనాలు ఇవ్వడం వల్ల దిగుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. నకిలీ విత్తనాలతో రైతులను ముంచేయడం దారుణమని విమర్శించారు. రైతులకు చెప్పిన దిగుబడులకు అనుగుణంగా సొమ్ము ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుల ఆందోళనలకు తమ సంఘం తరపున సంఘీభావం ప్రకటించారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి కృషి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

జీలుగుమిల్లి: పోలవరం నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రౌతుగూడెం నుంచి స్వర్ణవారిగూడెం వరకు పిఎమ్‌జిఎస్‌వై నిధులు రూ.5 కోట్ల 34 లక్షలతో 6 కిలోమీటర్ల మేర బిటి రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం ములగలంపల్లి పంచాయతీలో సీసీ రోడ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రహదారుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధి మాటలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కరాటం సాయి, గడ్డ మనుగు రవి, సర్పంచి సరియం రాజు, మండలాధ్యక్షులు రాము, సాయి, మధు, పంచాయతీ రాజ్ డిఇ సీతయ్య పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు నిధి వసూళ్లు

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని సానా రుద్రవరంలో కేరళ వయనాడ్ వరద బాధితులకై సహాయ నిధిని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వసూలు చేశారు. కేరళ విలయంలో సర్వం కోల్పోయిన బాధితులకు సహకారం అందించిన వారికి, రుద్రవరం వ్యవసాయ కార్మిక కుటుంబాలకు సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు కృతజ్ఞతలు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు పెరుమాళ్ల గోపి, మన్నె రమేష్, తలగటూరి ప్రకాష్ పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరినీ విడిచి పెట్టం

ప్రజాధనాన్ని తిరిగి జమ చేయిస్తాం : ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్



చింతమనేనిని పూలతో సత్కరిస్తున్న మహిళలు

దెందులూరు: అక్రమాలను ప్రశ్నిస్తే మహిళలపై కూడా తప్పుడు కేసులు పెడతారా? గత ఐదేళ్ల వైసిపి పాలన ప్రజాస్వామ్యంలో చీకటి దినాలుగా మిగిలిపోతుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. 'మీ కోసం-మీ చింతమనేని' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం పెదవేగి మండలంలోని పలు గ్రామాల పర్యటనలో భాగంగా కె.కన్నాపురం, తాళ్ల గోకవరం, కొప్పులవారి గూడెం గ్రామాల్లో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని గత వైసిపి పాలనలో దెందులూరు నియోజకవర్గాన్ని యథేచ్ఛగా దోపిడీ చేసిన వైసిపి అక్రమార్కులపై చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుని, దుర్వినియోగం అయిన ప్రజాధనం ప్రతి ఒక్క రూపాయిని తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమ చేయిస్తామని ఎంఎల్ఎ తెలిపారు. గత వైసిపి పాలనలో తమకు ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చేశారని, ఇళ్ల స్థలాల విషయంలో సైతం అవకతవకలకు పాల్పడ్డారని, ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి వేధించారన్నారు. ఆఖరికి భర్త చనిపోయి మూడేళ్లు అవుతున్న సదరు మహిళకు పింఛన్ రాకుండా చేశారని, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ సరఫరా వంటి పలు అంశాలపై తాము ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థులు ఎంఎల్ఎ చింతమనేని దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత ఐదేళ్లపాటు వైసిపి నాయకులు తమ అవినీతి అక్రమాలకు మాత్రమే అధికారాన్ని ఉపయోగించుకున్నారనీ, దొంగ సర్టిఫికెట్లు పెట్టి తమ బంధువులకు పింఛన్లు ఇప్పించుకున్న వైసిపి నాయకులు, కట్టుకున్న భర్తను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న మహిళకు మూడేళ్లు గడిచినా పింఛన్ ఇవ్వకుండా తిప్పటం వారి పరిపాలనకు సిగ్గు చేటు అని అన్నారు. వెంటనే సదరు మహిళకు పింఛన్ అందించటానికి కావాల్సిన ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేసి, రాబోయే కొత్త పింఛన్ల మంజూరులో ఆమెకు పింఛన్ మంజూరు అయ్యేలా అధికారులే బాధ్యత తీసుకుని చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండల అధ్యక్షులు బొప్పన సుధా, సెక్రటరీ మాధు రవి, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి కొనకళ్ల శివమణి గౌడ్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బండి ప్రణవి, కన్నపురం సర్పంచి ఈడ్పుగంటి రమేష్ పాల్గొన్నారు.

తహశీల్దారు సతీష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీఆర్‌ఒలు

ఉంగుటూరు తహశీల్దార్‌గా సతీష్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు తహశీల్దారుగా పి.సతీష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ద్వారకా తిరుమల నుంచి ఆయన బదిలీపై ఉంగుటూరు వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్(ఇన్‌ఛార్జ్ తహశీల్దార్) ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల తహశీల్దార్ పోతురాజు, సిఎస్‌డిటి స్వర్ణదుర్గ, ఆర్‌ఐ ఎస్‌ఎంఎస్ సత్యనారాయణ, వీఆర్‌ఒలు, రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఉంగుటూరు సర్పంచి బండారు సింధు, ఉప సర్పంచి పాతూరి జగదీష్, కార్యదర్శి జి.వి.గిరిధర్ కలిసిన వారిలో ఉన్నారు. అంతకు ముందు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజును క్యాంపు కార్యాలయంలో తహశీల్దార్ సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెరిగేందుకు పోర్ట్ స్టేట్ ఆఫ్ ఫ్యాషో ఎగ్జిబిషన్ దోహద పడుతుందని అధ్యాపకులు అన్నారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు విజయవాడ పివి సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో జరుగుతున్న పోర్ట్ స్టేట్ ఆఫ్ ఫ్యాషో ప్రదర్శనకు నారాయణపురం విద్యార్థులు మంగళవారం వెళ్లారు. వివిధ రకాల పరికరాలు, వాటి పనితీరును తెలుసుకోవడం వల్ల సైన్స్‌పై కొత్త విషయాలు తెలిసాయని విద్యార్థులు వెల్లడించారు. కళాశాల అధ్యాపకులు పలువురు విద్యార్థులతో పాటు ప్రదర్శనకు వెళ్లారు.

టిడిపి గ్రామ అధ్యక్షులు పంగిడేశ్వరరావు మృతి

ఆగిరిపల్లి : మండల పరిధిలోని చొప్పరమెట్ల గ్రామ పంచాయతీ సర్పంచి కూరాకుల ఊర్మిళ భర్త టిడిపి గ్రామ అధ్యక్షులు, పంచాయతీ పాలకవర్గ 7వ వార్డు సభ్యులు అయిన కూరాకుల సాంబశివ పంగిడేశ్వరరావు(53) సోమవారం రాత్రి తన స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె కలరు. సాంబశివ పంగిడేశ్వరరావు భౌతికకాయాన్ని నూజివీడు నియోజకవర్గ టిడిపి నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు, ఆగిరిపల్లి మాజీ జెడ్‌పిటిసి కాజా రాంబాబు, ఆగిరిపల్లి మండల టిడిపి అధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరరావు, అమ్మవారిగూడెం ఎంపిటిసి దానిమేటల సత్యనారాయణ, టిడిపి టౌన్ అధ్యక్షులు పామర్తి నరసింహారావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి, అధికారులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

'వెంకటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు'

చింతలపూడి: సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు మృతి పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని లోటని సిపిఐ సీనియర్ నాయకులు వసంతరావు అన్నారు. వెంకటేశ్వరరావు మృతికి సిపిఐ చింతలపూడి మండల కమిటీ తరపున సంతాపాన్ని, వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజన సమైక్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి, నూజివీడు సిపిఐ ఏరియా కార్యదర్శి స్థాయికి ఎదిగారని, గ్రామ సమస్యలపై ఆయన పోరాడే సమయంలో గ్రామంలో ఉన్న భూస్వాములు పెట్టిన కేసులలో నాలుగు సంవత్సరాలు జైలు జీవితం గడిపిన వ్యక్తి వెంకటేశ్వరరావు అని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు పుల్లూరు సోమశేఖర ఆచార్యులు, తుర్లపాటి బాబు, మండల కమిటీ సభ్యులు దంత కృష్ణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలపూడి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నట్లు విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ పి.శివ రామకృష్ణ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు శ్రీకరణం కుమార్ రీజినల్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారి, ఏలూరు వారికి రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం ప్రకారం వారి ఆదేశాల మేరకు చింతలపూడి మండలం దేశవరం గ్రామం వద్ద రెండు బడా దోస్త్ వాహనములు ఎపి 39 యుయు 3085లో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం, ఎపి 39 టిఎస్ 4588లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం, దేసవరం చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో కొనుగోలు చేసి వాటిని ఎపి 05 టిఎం 4455 నెంబరు గల అశోక్ లైలాండ్ వాహనములో ఎగుమతి చేస్తున్నారన్నారు. ఇది గమనించి ఆ మూడు వాహనములు విజిలెన్సు, రెవెన్యూ, పౌర సరఫరా అధికారులు తనికీ చేయగా మొత్తం 75 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుచున్నట్లు గుర్తిన్నట్లు తెలిపారు. వాహనముల డ్రైవర్లు కాకినాడకు చెందిన సామిరెడ్డి వీర వెంకట రావు, కొడమంచిలి బుజ్జి, శంకుచక్రపురంకు చెందిన కటారి చెన్న రావులను ప్రశ్నించగా రేషన్ బియ్యం పిఠాపురంకు చెందిన చోడిసెట్టి మహేష్, చోడిసెట్టి సతీష్‌నకు చెందినవిగా, కాకినాడకు తరలిస్తున్నట్లుగా తెలియజేశారు. ఈ తనిఖీల్లో రూ.3 లక్షల విలువ కలిగిన బియ్యం, రూ.24 లక్షల విలువ కలిగిన వాహనములు వెరసి మొత్తం రూ.27 లక్షల విలువ కలిగిన సొత్తును సీజ్ చేసి సామిరెడ్డి వీర వెంకట రావు, కొడమంచిలి బుజ్జి, కటారి చెన్నారావు, చోడిశెట్టి మహేష్, చోడిశెట్టి సతీష్, ఆకుల వీరబాబు అను వారిపై నిత్యావసరవస్తువుల చట్టం 1955 ప్రకారం వారిపై కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. ఈ తనిఖీల్లో చింతలపూడి సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మల్లికా జరీనా, పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.

కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ముదినేపల్లి: కలుపు నివారణపై రైతులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కె.ఫణి కుమార్, ఎన్.నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో మంగళవారం పర్యటించి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగు చేసే రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ముఖ్యంగా మండలంలో 90 శాతం వరకు వెదజల్లే పద్ధతిలో రైతులు సాగు చేశారన్నారు. కలుపు నివారణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా రైతులకు సూచించారు. ముఖ్యంగా ఎండాకు తెగులును తట్టుకొనుటకు మొక్కలకు ఎరువుల తొలి కోటాలో ఎకరానికి 20 కేజీల చొప్పున పొటాష్ ఎరువును అందించాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో రైతులకు సంబంధించిన పొలాలను పరిశీలించి వారికి సంబంధించిన ఇబ్బందులకు తగిన నివారణ ఉపాయములను సూచించారు. ఈ కార్యక్రమంలో మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, ముదినేపల్లి మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ శ్రీహరిపురం, రైతులు పాల్గొన్నారు.

కాకరవాడ సర్పంచి రామారావు మృతి

ముదినేపల్లి: మండలంలోని కాకరవాడ గ్రామ సర్పంచి కాగిత రామారావు(60) మంగళవారం ఉదయం మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సర్పంచిగానే కాక గతంలో కాకరవాడ సొసైటీ అధ్యక్షులుగా కూడా పనిచేశారు. రామారావు మృతి వార్త తెలుసుకున్న కైకలూరు మాజీ ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి, అంజలి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు అంజలి ఘటించిన వారిలో ఉన్నారు. రామారావు అంత్యక్రియలు సాయంత్రం నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

లారీలు ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి నూజివీడు టౌన్

మండల పరిధిలోని మీర్జాపురం గ్రామంలోని జెడ్‌పి హైస్కూల్ సమీపంలో గల ప్రధాన రహదారిపై ఎదురెదురుగా రెండు లారీలు వేగంగా వచ్చి మంగళవారం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. జోరుగా వర్షం కురుస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకోవడంతో హైవే పెట్రోలింగ్ కానిస్టేబుల్ రాజ్‌కుమార్ చొరవ చూపి జెసిబి సాయంతో రెండు లారీల బ్యానెట్‌లలో ఇరుక్కుపోయిన బాధితులను బయటకు తీశారు. సమాచారం అందించడంతో 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వాటర్ ట్యాంక్ శుభ్రం చేయండి మహాప్రభో..!

ప్రజాశక్తి - చింతలపూడి

జిల్లా అధికారులు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఓ పక్క నుంచి అధికారులు చెబుతున్నా కింది స్థాయిలో ఏ విధంగానూ దృష్టి సారించని పరిస్థితి నెలకొంది. చింతలపూడి మండలం పంతంగులగూడెంలోని గ్రామంలో మంచినీటి వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి వాటర్ ట్యాంకు శుభ్రం చేసి సంవత్సరం అవుతుందని

నీటిలో పేరుకుపోయిన పాకుడు

గ్రామస్తుల వేడుకోలు

వాపోతున్నారు. బ్లీచింగ్ చల్లి వెళ్లిపోతున్నారని, వాటర్ ట్యాంకుల్లో పాకుడు పేరుకుపోయి స్నానం చేసినప్పుడు ఒళ్లంతా దురదలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిని తాగటం వల్ల అనారోగ్యం బారిన పడుతున్నామని, అధికారులు గుర్తించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో వేడుకొంటున్నారు.

గ్రామంలోని వాటర్ ట్యాంక్

పంచాయతీ సెక్రెటరీకి తెలియజేశాం

ఎంపిడిఒ చిన రాట్నాలు

మండలం మొత్తం మంచినీటి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించాలని పంచాయతీ సెక్రెటరీకి తెలియజేశాం. సమస్యను పరిష్కరిస్తాం.

అధికారులకు ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకోవడం లేదు

బాణావత్తు వెంకటమ్మ, పంతంగులగూడెం

వాటర్ ట్యాంక్ శుభ్రం చేయమని ఎన్నిసార్లు అధికారులను, నాయకులను మొత్తుకున్నా పట్టించుకోవడం లేదు. వాటర్ ట్యాంక్ క్లీన్ చేయకుండా బ్లీచింగ్ చల్లి వెళ్లిపోతున్నారు. మంచినీటిలో పాకుడు పేరుకుపోయి చాలా ఇబ్బందులు పడుతున్నాము, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కో రుకుంటున్నాను.

సమస్యను పరిష్కరించాలి

శ్రీరాములు, పంతంగులగూడెం

మంచినీటి వాటర్ ట్యాంక్ శుభ్రం చేయకపోవడం వల్ల ట్యాంక్ అంతా పాకుడు పట్టి స్నానం చేసిన తర్వాత దద్దుర్లు వస్తున్నాయి. జ్వరాలు కూడా వస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్యను పరిష్కరించడం లేదు. బ్లీచింగ్ చల్లి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా పట్టించుకొని సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నాం.

ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించాలి

ఎపిఎం కుంటంబాబు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలు మహిళలు అందరికీ చేరువయ్యేలా అవగాహన కల్పించాలని నూజివీడు ఏరియా కోఆర్డినేటర్ విజయకుమారి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు వెలుగు కార్యాలయంలో ఎపిఎం కుంటంబాబు ఆధ్వర్యంలో వెలుగు సీసీలకు, బుక్కు కీపర్లకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలు స్వయం కృషితో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు పథకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ఆ పథకాలు అందరికీ చేరువయ్యేలా కృషి చేయాలని తెలియజేశారు.

కార్యదర్శిని సన్మానిస్తున్న అధికారులు

శ్యాంసుందర్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామపంచాయతీ పరిపాలనలో కార్యదర్శి శ్యాంసుందర్ ముఖ్యపాత్ర వహించి సేవలు అందించారని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని పెయ్యేరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామ పంచాయతీ గ్రేడ్-2 కార్యదర్శిగా వెళ్లిన యార్లగడ్డ శ్యాంసుందర్‌కు మంగళవారం రాత్రి పెయ్యేరులో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శికి గ్రామ ప్రముఖులు, సహచర ఉద్యోగులు, శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ విఆర్‌ఒ కారే కేశవ, డిజిటల్ అసిస్టెంట్, వల్లి, వీరస్వామి పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో సేవలందించేందుకు కృషి

తహశీల్దార్ రమాదేవి

ప్రజాశక్తి - భీమడోలు

అర్హులైన ప్రతిఒక్కరికీ తన కార్యాలయం ద్వారా పూర్తిస్థాయిలో సేవలు అందించేందుకు కృషి చేస్తానని భీమడోలు తహశీల్దార్‌గా నియమితులైన బి.రమాదేవి హామీ ఇచ్చారు. గతంలో ఏలూరు కలెక్టరేట్‌లో పనిచేసిన రమాదేవి ఎన్నికల విధులలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కడియం తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఎన్నికల అనంతరం జిల్లాకు తిరిగి వచ్చిన నేపథ్యంలో భీమడోలు తహశీల్దార్‌గా నియమితులై మంగళవారం


నూతన తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన విఆర్‌ఒలు

తహశీల్దార్‌ను అభినందిస్తున్న డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్, అధికారులు

బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా భీమడోలు డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మాధవరావు, సర్వేయర్, నూతన తహశీల్దార్‌కు స్వాగతం పలికి అభినందించారు. విఆర్‌ఒలు, యూనియన్ నాయకులు శంకర్ ఆధ్వర్యంలో నూతన తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ పరిచయాలను చేసుకున్నారు. అనంతరం నూతన తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ తన విధి నిర్వహణలో కార్యాలయ సిబ్బంది, అధికారులు తమ వంతు సహకారాన్ని అందజేయాలని కోరారు.

దెందులూరు తహశీల్దార్‌గా సుమతి

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు తహశీల్దార్‌గా బత్తుల సుమతి మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 2009లో ఎపిపిఎస్‌సి గ్రూప్-2లో డిప్యూటీ తహశీల్దారుగా ఎంపికయ్యారు. 2012లో వరంగల్ జిల్లా నరసింహులు పేట తహశీల్దార్‌గా సర్వీసులో చేరారు. 2014లో ఖమ్మం జిల్లా కామేపల్లి తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లాలో కుక్కునూరు తహశీల్దారుగా ఏలూరు కలెక్టరేట్‌లో ఆర్‌డిఒ ఎఒ, జంగారెడ్డిగూడెం పోలవరం తహశీల్దారుగా పనిచేశారు. ఎన్నికల విధుల నిర్వహణ నిమిత్తం కృష్ణాజిల్లా చల్లపల్లి తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో చల్లపల్లి నుంచి దెందులూరు తహశీల్దారుగా నియమితులయ్యారు. తహశీల్దార్ బి.సుమతి పోలవరం తహశీల్దారుగా పనిచేసిన

సుమతి(ఫైల్ ఫొటో)

2021-22 సమయంలో పోలవరం మండలంలోని 19 గ్రామాల్లో మూడువేల నిర్వాసిత కుటుంబాలను అక్కడ నుంచి ఆర్‌ఎన్‌ఆర్ కాలనీలకు తరలించారు. వారికి ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీ సైతం మంజూరు చేయించి అందించారు. సుదీర్ఘకాలంగా వరద ముంపు మండలంగా ఉన్న పోలవరం సురక్షిత మండలంగా రూపుదిద్దుకుంది. ఆ సమయంలోనే ముంపు సమస్యను పరిష్కరించడం, ఆర్‌ఎన్‌ఆర్ ప్యాకేజీ అందించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ తహశీల్దారుగా గుర్తింపును పొందారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్లు ముత్యాలరాజు, భాస్కర్‌ల చేతులమీదుగా ఉత్తమ తహశీల్దారుగా అవార్డు తీసుకున్నారు. ఉన్నతాధికారుల ప్రోత్సాహం, ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహాయ సహకారాలతో దెందులూరు మండల అభివృద్ధికి తహశీల్దారుగా తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

కొనసాగిన తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అప్పుడే పుట్టిన పిల్లలకు గంట వ్యవధిలో తల్లిపాలు పట్టించడం ఆరోగ్యమని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవమ్మ అన్నారు. మంగళవారం జీలుగుమిల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం-2లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి గాయత్రి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకూ తల్లిపాలను ఇవ్వడం బిడ్డకు శ్రేష్టమని అన్నారు. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణులకు వివరించారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు యు.నాగమణి, సరళ, ఆసుపత్రి సిబ్బంది, ఆయాలు పాల్గొన్నారు.

ఉంగుటూరు: తల్లిపాలు బిడ్డకు మంచి బలవర్ధక ఆహారమని, ఈ విషయంలో బాలింతలు, గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ భీమడోలు

ఉంగుటూరు : అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పదార్థాలతో స్టాల్స్


జీలుగుమిల్లి : అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పదార్థాలతో స్టాల్స్

ప్రాజెక్టు చేబ్రోలు సెక్టారు పర్యవేక్షకురాలు ఎం.శారదా మణి అన్నారు. చేబ్రోలులో 8 అంగన్‌వాడీ కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు స్థానిక 187 కోడ్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా వందరోజుల ప్రోగ్రామ్‌పై తల్లులు, గర్భిణులకు వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన వివిధ పోషకాహార స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు కె.మాధవి, కుమారి, సరస్వతి, అన్నపూర్ణ, కాలికా, గౌరీపార్వతి, శాంతకుమారి, శ్రీదేవి, విజయ, ఆశా కార్యకర్త విజయ, ఆయాలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నూజివీడు అర్బన్ ముస్లింపేట అంగన్వాడీ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, వాటిలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని, తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యమని వివరించారు. ప్రతి తల్లి బిడ్డకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం గర్భవతులకు, బాలింతలకు, పిల్లల తల్లులకు టేక్ హోం రేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: మండలంలోని మంగపేట, బొడిగూడెం అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ యుఎన్.స్వర్ణకుమరి తల్లిపాల ప్రాముఖ్యతను, వాటి ప్రయోజనం గురించి వివరించారు. తల్లిపాల వల్ల సరైన పోషకాహారంతో పాటు రోగ నిరోధక వ్యవస్థను మెరుగు పరచడంలో ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. సులువుగా జీర్ణమవ్వడం, మెదడు అభివృద్ధి, అలర్జీ ప్రమాదాల తగ్గుతాయన్నారు. తల్లి సకాలంలో పాలు ఇవ్వడం వల్ల బరువు తగ్గడం, కేన్సర్ ప్రమాదం కూడా దరిచేరదన్నారు. అనంతరం తల్లులకు శ్రీమతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఎ.నయోమి రాణి, కార్యకర్తలు సునీత రాయల్, జ్యోతి, శాలిని, భవాని పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.ఝాన్సీ పాల్గొని మాట్లాడుతూ తల్లులకు హాస్పిటల్ ప్రసవాల ప్రోత్సాహకం, తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని, బిడ్డ పుట్టిన వెంటనే గంట లోపు ముర్రుపాలు పట్టాలని తెలిపారు. గర్భిణీగా ఉన్నప్పుడే తల్లిపాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.సృజన ఇంజనీరింగ్ కన్సల్టెంట్, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు నూర్జహాన్, వసుంధర, సుధ, శ్యామల, దయామణి, నాగమణి, మున్ని, బాలింతలు, గర్భిణులు హాజరైనారు.

చాట్రాయి : మండలంలోని ఇందిరా క్రాంతిపథకం కార్యాలయంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిడిపిఒ నూరాణి మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత లేకుండా ఐరన్ టాబ్లెట్లు, మంచి ఆహారం తీసుకోవాలని అన్నారు. ప్రసవించిన అనంతరం తల్లిపాలు తప్పనిసరిగా బిడ్డలకు పట్టించాలని, తల్లిపాలు పిల్లలకు సంపూర్ణ ఆహారమని, వ్యాధి నిరోధక శక్తి తల్లి పాల నుంచి లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగాకుమారి, ప్రభుత్వ వైద్యాధికారి ఎం.జ్యోతి, అంగన్వాడీ సూపర్వైజర్స్ గాయత్రీ దేవి, నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ముసునూరు: బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇచ్చినట్లయితే తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు టి.షకీనా ఇవాంజిలిన్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి మండలంలోని 16 గ్రామాల ఆశావర్కర్ల ఆధ్వర్యంలో గ్రామస్తులకు తల్లిపాలపై అవగాహన కలిగించే విధంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.

భీమడోలు : అంతరాలను పూరించి తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ సిడిపిఒ కె.విజయలక్ష్మి కోరారు. గుండుగొలను సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్ర 23లో కార్యకర్త బి.రాజామణి, పర్యవేక్షకులు ఎం.కవితల సంయుక్త ఆధ్వర్యంలో


ముసునూరు : తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహనా ర్యాలీ

మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఒతో పాటు గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని చేపట్టారు. పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎం.విజయ, డి.పద్మలతోపాటు గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్ రాగానే పరిష్కరిస్తా : ఎంఎల్‌ఎ

ఏలూరు అర్బన్: ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 9 మంది డ్రైవర్స్ ఉద్యోగోన్నతి విషయంలో రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్ రాగానే పరిష్కరించడానికి కృషిచేస్తానని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య(చంటి) ఎఐటియుసి నాయకులకు హామీ ఇచ్చారు. ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 8 మంది పబ్లిక్ హెల్త్ డ్రైవర్లు, వాటర్ సప్లైలో పనిచేస్తున్న వారు ఒకరు, మొత్తం తొమ్మిది మందికి 2022 మార్చి 30న హెవీ వెహికల్స్ డ్రైవర్స్‌గా ఉద్యోగోన్నతి ఉత్తర్వులు ఇచ్చారని, కానీ రెండు సంవత్సరాల నాలుగు మాసాలుగా వాళ్లకు సంబంధించిన ఉద్యోగోన్నతి వేతనాలు, ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా సంబంధిత అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘం ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం ఏలూరు ఎంఎల్‌ఎ చంటిని కలిసి వివరించారు. పూర్తిస్థాయిలో మున్సిపల్ కమిషనర్ కార్పొరేషన్‌కు రాగానే డ్రైవర్ల సమస్య, బోనస్ సమస్య పరిష్కరిస్తానని ఎంఎల్‌ఎ నాయకులకు హామీ ఇచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, సహాయ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

అసలైన జాబ్ కార్డుల కోసం గ్రామ సభలు

ఉంగుటూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో జాబ్ కార్డులు, అందులో నమోదైన వేతనాల వెరిఫికేషన్ గ్రామసభలు ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ డిఎల్‌ఎస్ శర్మ మంగళవారం వెల్లడించారు. గ్రామాల్లో ఉన్న జాబ్‌కార్డులు గ్రామాల్లో ఉన్న వారికే ఇచ్చారా? లేదా అన్నది బహిరంగ సభల ద్వారా వెల్లడించాల్సి ఉంటుంది. జాబ్ కార్డులు చేసిన పనికి తగిన వేతనాలు పడ్డాయా? లేదా అని ఆరా తీయడం జరుగుతుంది. ఆయా సభలు గ్రామ సర్పంచుల అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంది. ఈమేరకు గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని బోగస్ కార్డులుంటే గ్రామ సభల్లో వెల్లడించాలని అధికారులు కోరారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి నీటిమట్టం

పోలవరం : గత కొన్ని రోజులుగా పెరుగుతూ, తగ్గుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం మంగళవారం తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే నుంచి 6,27,629 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువన 30.820 మీటర్లు, స్పిల్వే దిగువన 22.080 మీటర్ల నీటిమట్టం నమోదయినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎల్లండీపేట, కొవ్వాడ రిజర్వాయర్లో నీటిమట్టం 89.40 మీటర్లు నమోదయిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 120 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు సిబ్బంది తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులైన తమతపు రవి కిషోర్ తండ్రి వెంకటేశ్వరరావు అను నేను నా యొక్క పాస్ పోర్ట్ గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో పాస్ పోర్ట్ నెంబర్ M7738658 పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరికలేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయవలసినది గలరు.

తమతపు రవి కిషోర్, తండ్రి వెంకటేశ్వరరావు
గణపవరం గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా. సెల్ . 8985345222

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా నిడమర్రు మండలం క్రోవ్విడి గ్రామ కాపురస్తులైన మానుకొండ సునీత భర్త జాన్ మోస్ అను నేను నా యొక్క పాస్ పోర్ట్ క్రోవ్విడి నుండి నిడమర్రు మా బంధువులు ఇంటికి వెళ్లే మార్గమధ్యలో పాస్ పోర్ట్ నెంబర్ N5374345 పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు దొరికిన వారు ఈ కింది నెంబర్ కు తెలియజేయవలసినది గలరు.

మానుకొండ సునీత
భర్త జాన్ మోస్, క్రోవిడి గ్రామం, నిడమర్రు
మండలం ఏలూరు జిల్లా.
సెల్ . 8886329159

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, (సీనియర్ డివిజన్)

O.S.No.7/2014

వాది: పుచ్చకాయలు నవీన్

Vs

ప్రతివాదులు : పుచ్చకాయలు కృష్ణమూర్తి (Died) వగైరా

నోటీసు

To.

3వ ప్రతివాది : నల్లి జయదుర్గ, భర్త సువర్ణరాజు, డోర్‌నెం. 2-2/55, చలువపేట, నర్సాపురం టౌన్.

4వ ప్రతివాది : దేశాబత్తుల వెంకట లక్ష్మి, భర్త వెంకటేశ్వరులు, డోర్‌నెం. 2-2/55, చలువపేట, నర్సాపురం టౌన్.

6వ ప్రతివాది : పుచ్చకాయలు హేమలత, భర్త వెంకటరమణ, డోర్‌నెం. 2-2/55, చలువపేట, నర్సాపురం టౌన్, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు O.S.No.7/2014 3,4,6వ ప్రతివాదులు అయిన మీకు పైకోర్టు నుండి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను అమలు జరగనందున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు ది.13-8-2024వ తేదీన ఉదయం గం.10.00 ని.లకు శ్రీకోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని, హాజరు అయ్యి మీ అభ్యంతరములు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై దావాని మీ పరోక్షమున తీర్మానించబడును, గాన మీకు తెలియజేయడమైనది.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం

దేవ రంజిత్ కుమార్, చొప్పల అశోక్,

నర్సాపూర్ వాది తరపున అడ్వకేట్స్, నర్సాపురం.

తేది.6-8-2024 సెల్: 98483 32116